


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శుక్రవారం,6 మార్చి 2026 8 పేజీలు

## 200 ఏళ్ల రామయ్య

# ఉనికికే ముప్పు!



### పాలకుల పీసీల దాహానికి భక్తుల కన్నీళ్లు

### అన్నవరంలో లేని నిబంధనలు కాకినాడలోనే ఎందుకు?




- వందల ఏళ్ల చరిత్రకు అధికారుల తిలోదకాలు
- విగ్రహాల తరలింపుపై భక్తుల గర్జన
- ఎక్కడి శాస్త్రం ముసుగులో 'అధోదృష్టి' రాజకీయం
- కలెక్టర్ ఆదేశాలకూ దేవాదాయ శాఖ బేఖాతరు!
- అన్నవరం ఆదర్శం.. అధికారుల నిర్లక్ష్యం
- రిటైర్మెంట్ వేళ 'పీసీ'ల కోసం తప్పుడు అడుగులు
- శ్రీరామనవమి ముంగిట 'రామ' యుద్ధం

మిగతా 2 లో..




**కాకినాడ మెయిన్ రోడ్డులోని చారిత్రక శ్రీ సీతారామస్వామి ఆలయం ఇప్పుడు వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. 200 ఏళ్ల భక్తుల నమ్మకాన్ని,ఆగమ శాస్త్ర సంప్రదాయాలను పక్కనబెట్టి..కేవలం టెండర్లు, కమిషన్లకోసం అధికారులు స్వామివారి మూలవిరాట్టులను కదిలించేందుకు కుతంత్రం పన్నుతున్నారు. భక్తుల మనోభావాలకు, అధికారుల స్వార్థానికి మధ్య జరుగుతున్న ఈపోరాటం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది.**

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్ :

# ముఖ్యమంత్రి సమీక్షల దిశానిర్దేశం

### -జిల్లా పరిపాలన విషయంలో జిల్లా యంత్రాంగంపై మరింత బాధ్యత -కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జిల్లాల పనితీరుపై ప్రత్యక్ష పర్యవేక్షణ,సమగ్ర సమీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాపరిపాలన యంత్రాంగం ఒకటీంగా మరింత బాధ్యతాయుతంగా, జవాబుదారీతనం పెంచే విధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ప్రజలకు అందించే పౌర సేవలు,సేవలనాణ్యత, సంక్షేమ పథకాల అమలు, ఫిర్యాదులపరిష్కారం, చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఫలితాల ఆధారిత ప్రమాణాలపై క్రమం తప్పకుండా విశ్లేషణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ కీర్తిచేకూరి స్పష్టం చేశారు. జిల్లా అవసరాలు, ప్రజల ఆకాంక్షల ఆధారంగా అదనపు ప్రాధాన్యత అంశాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ప్రణాళిక మండలి మంత్రిగారి అధ్యక్షతన,ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్లమెంట్ సభ్యునితో సంప్రదింపుల సమావేశం నిర్వహించి జిల్లా ప్రాధాన్యతలను ఖరారు చేయాలని ఆమె వివరించారు.ప్రణాళికశాఖ అందించిన అంశాలను సమీక్షించి, సంబంధిత శాఖల కార్యదర్శులు ,విభాగాధిపతులతో చర్చించి విధానపరమైన అంశాలు, అమలుసవాళ్లు,

- తరువాయి 2లో..

# పారిశ్రామిక భద్రతా వారోత్సవాలు

### కార్మికులకు రక్షణ..ప్రజలకు భరోసా ! డిప్యూటీ సిఐఎఫ్ నారాయణ







**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** పరిశ్రమల అభివృద్ధి ఎంతముఖ్యమో, అక్కడ పనిచేసే కార్మికుల ప్రాణరక్షణ మరియు పరిసర ప్రాంత ప్రజల భద్రత కూడా అంతే ముఖ్యమని జిల్లా యంత్రాంగం స్పష్టంచేసింది. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం పెద్దాపురం, హుస్సేన్‌పురం పారిశ్రామిక ప్రాంతాల్లోని ప్రముఖ పరిశ్రమల్లో నిర్వహించిన 'మాక్ డ్రిల్స్' భద్రతా వ్యవస్థల పటిష్టతను చాటిచెప్పాయి.

**పరిశ్రమల సందడి – క్షేత్రస్థాయి పరిశీలన**

కేబీకే బయోటెక్, వెంకటరమణ ఆయిల్స్, రాక్ సిరామిక్స్ మరియు అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమల్లో



డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్‌ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్. నారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చుక్కా గణపతి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ గౌతమ్ పర్యటించారు.

- తరువాయి 2లో..

# 200 ఏళ్ల రామయ్య ఉనికికే ముప్పు!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్ :** భద్రాచలంలో రామదాసు గారు చెరసాల పాలై స్వామివారి ఆలయాన్ని నిర్మించి చరిత్రకెక్కారు. నేడు కాకినాడలో 200 ఏళ్ల నాటి చారిత్రక శ్రీ సీతారామస్వామి ఆలయంఅధికారులఅలసత్వం,పంతాలవల్ల 'చెరసాల'ను తలపిస్తోంది. కోట్లాది రూపాయల భక్తుల విరాళాలు మూలుగుతున్నా..పునర్నిర్మాణం మాత్రంఅడుగుముందుకుపడటంలేదు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలు భక్తుల మనోభావాలను ముక్కలు చేస్తున్నాయి.

**ఘన చరిత్ర – భక్తుల ఆవేదన**

1825 ప్రాంతంలో వెలసిన ఈ ఆలయం కాకినాడ ప్రజల ఆత్మగౌరవం. తరతరాలుగా స్వామివారి మూలవిరాట్టులను దర్శించుకుని తరించిన లక్షలాది మంది భక్తులు, ఈ క్షేత్రాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. స్వామివారి విగ్రహాలను కదిలించవద్దని భక్తులు వేడుకుంటున్నారు. "మొక్కులు తీర్చుకున్న చోట, మూలవిరాట్టులు ఉన్న చోటే ఆలయం ఉండాలి" అనేది భక్తుల అచంచల విశ్వాసం. కానీ అధికారులు మాత్రం 'బాలాలయం' పేరుతో విగ్రహాలను తరలించాలని చూడటం భక్తుల గుండెల్లో చిచ్చు పెడుతోంది.

**నిధులున్నా కదలని వైనం**

భక్తుల నుండి సేకరించిన రూ.2.40 కోట్లు దేవాదాయ శాఖ వద్ద సిద్ధంగా ఉన్నాయి. కానీ పనులు మాత్రం మొదలుకావడం లేదు. అధికారుల టెక్నికల్ ప్లాన్ కోసం 200 ఏళ్ల నాటి విశ్వాసాన్ని పణంగా పెట్టడం ఇక్కడి విషాదం. భద్రాద్రి రామదాసు తన సర్వస్వాన్ని ధారపోసి ఆలయం కడితే, ఇక్కడ సిద్ధంగా ఉన్న నిధులను కూడా ఖర్చు చేయకుండా, భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తూ కాలయాపన చేయడం వెనుక ఆంతర్యమేమిటి?

**అధికారుల 'శాస్త్ర' వితండవాదం**

శ్రీరామనవమి పండుగకు రోజులు దగ్గరపడుతున్న వేళ, భక్తులు నేడు అధికారుల మొండివైఖరితో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విగ్రహాలను కదపకుండా వాటిపై నిర్మాణం చేస్తే స్వామివారికి 'అధోదృష్టి' కిందకు చూడటం ఏర్పడుతుందని, అది అరిష్టమని అధికారులు వితండవాదం చేస్తున్నారని... బాలాలయానికి తరలించడమే శాస్త్రబద్ధమని చెబుతూ విగ్రహాలను కదిలించేందుకు పంతం పడుతున్నారని , అధికారుల 'అధోదృష్టి'వాదనను భక్తులుకొట్టిపారేస్తున్నారు. విగ్రహాలను కదిలించకుండానే, పురాతన పవిత్రత దెబ్బతినకుండా నిర్మాణం చేసే మార్గాలున్నా అధికారులు కావాలనే ఎక్కడో శాస్త్రాన్ని అడ్డుపెట్టుకుని విగ్రహాలను కదిలించాలని చూడటం అరిష్టమని భక్తులు హెచ్చరిస్తున్నారు.

**కలెక్టర్ మెట్లు ఎక్కిన వివాదం**

అధికారుల ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ సామాజిక కార్యకర్త డి.ఎన్.రమేష్ ఆధ్వర్యంలో భక్తుల బృందం జిల్లా కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్‌ని కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. అధికారులు నిర్వహించిన గ్రామసభలో భక్తుల తీవ్ర అభ్యంతరాలను కనీసం రికార్డు చేయకపోవడం, పారదర్శకత లేకుండా నిర్ణయాలు తీసుకోవడం చట్టవిరుద్ధమని భక్తులు వాదిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్, సమస్యను తక్షణమే పరిష్కరించాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. శాస్త్రాలను, ఆగమ ధర్మాలను అనుసరిస్తూనే.. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**శాస్త్రం 'కొండ'కో రూలు.. 'గుడి'కో తీరా?**

**– అధికారులను నిలదీస్తున్న భక్తులు!**

"ఆగమ శాస్త్రం అంటే అధికారుల సౌకర్యం కోసం మార్చుకునే నిబంధనల చిట్టా కాదు కదా?" అని భక్తులు అధికారులను సూటిగా నిలదీస్తున్నారు. "ఒకే దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న అన్నవరం కొండ మీద ఒక శాస్త్రం, కాకినాడ రామాలయంలో మరో శాస్త్రం ఎలా ఉంటుంది?" అని భక్తులు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. విగ్రహాల తరలింపు విషయంలో అధికారుల సొంత వ్యాఖ్యానాల కంటే.. తిరుమల తిరుపతి దేవస్థానం వైదిక పండితులు లేదా శృంగేరి శారదా పీఠాధిపతుల వంటి ధర్మకోవిదుల సూచనలనే ప్రామాణికంగా తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అన్నవరం పునర్నిర్మాణాన్ని ఒక గీటురాయిగా భావించి, అక్కడ విగ్రహాలు కదపకుండా పనులు సాధ్యమైనప్పుడు, ఇక్కడ ఎందుకు సాధ్యం కాదు? మీ పంతం కోసమా? లేక పీసీల కోసమా? అని భక్తులు అధికారుల ముఖం మీదే అడుగుతున్నారు. "శాస్త్రం ముసుగులో స్వార్థం దాగి ఉంటే, అది ధర్మ ఉల్లంఘనే అవుతుందని భక్తులు గట్టిగా హెచ్చరిస్తున్నారు."

**అన్నవరం స్ఫూర్తి ఏది?**

అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణ సమయంలో అప్పటి ఈవో, నేటి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ వ్యవహరించిన తీరు నేటి అధికారులకు ఒక దిక్సూచి. నాడు విగ్రహాలను కదపకుండా, వందల ఏళ్ల నాటి చారిత్రక ప్రతిష్ఠా శక్తిని ఏమాత్రం దెబ్బతీయకుండా, అత్యంత అద్భుతంగా ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి చేశారు. దానినే ఆదర్శంగా తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అన్నవరంలో సాధ్యమైంది కాకినాడలో ఎందుకు కాదనేది ఇప్పుడు ప్రశ్నార్థకం.

**స్వార్థం కోసం సంప్రదాయాల బలి?**

ప్రస్తుత ఈవో పదవీ విరమణ సమయం దగ్గరపడుతుండటంతో, ఎలాగోలా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించి టెండర్లు పిలవాలనే ఆరాటంలో ఉన్నట్లు కనిపిస్తోంది. విగ్రహాలను తరలించి, బాలాలయం ఏర్పాటు చేస్తేనే పనులు సులభమవుతాయని, తద్వారా టెండర్లు త్వరగా ముగించి తన వాటా పీసీలు దక్కించుకోవచ్చనే దురాలోచనలో అధికారులు ఉన్నట్లు భక్తులు వాదిస్తున్నారు.

కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు మరియు ఈవోల త్రయం కలిసి తమ లాభాల కోసం 200 ఏళ్ల భక్తుల నమ్మకాన్ని తాకట్టు పెట్టడం శోచనీయం. తన స్వార్థం కోసం స్వామివారిని కదిలించాలని చూడటం అరిచే దగ్గర విషయం కాదని భక్తులు గట్టిగా హెచ్చరిస్తున్నారు."రామరాజ్యం" అంటే ప్రజల మాట వినే రాజ్యం కావాలి తప్ప, అధికారుల పంతం నెగ్గే రాజ్యం కాకూడదు. ఈ శ్రీరామనవమి లోపు రామయ్య పునర్నిర్మాణానికి అధికారులు శుభం పలుకుతారో లేక వివాదాన్ని మరింత రాజేస్తారో వేచి చూడాలి!

# మహిళల భద్రత, చిన్నారుల చట్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



**– అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా డీఎల్ఎస్ఏ**

**– ఐసీడీఎస్ సంయుక్త ర్యాలీ**

**– డిఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** నల్సా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్ సూచనలతో మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించే దిశగా వివిధ కార్యక్రమాలు రూపొందించి సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ నుంచి దేవిచౌక్ వరకు ఐసీడీఎస్, డీఎల్ఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో మహిళలు ఉద్యోగ బాధ్యతలతో పాటు గృహ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా వివక్ష ధోరణులు, దాడులు కొనసాగడం శోచనీయం అని అన్నారు. ఆడపిల్లలతో పాటు అబ్బాయిలకు కూడా సమానంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఆ బాధ్యత తల్లిదండ్రులు మరియు సమాజం పంచుకోవాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రత కోసం అమల్లో ఉన్న చట్టాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భవ్య కిషోర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది, పోలీసులు, మహిళలు, డీఎల్ఎస్ఏ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సమీక్షల దిశానిర్దేశం

మొదటిపేజి తరువాయి

పెండింగ్ అనుమతులు, అంతర శాఖ సమన్వయం వంటి విషయాలను పరిశీలించా లని తెలిపారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగించేతక్షణ ఫలితాల కార్యక్రమాలకు ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలని, అంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం (20:80నిష్పత్తి) అందే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. అలాగే జిల్లా స్థాయిలో స్వీయ అంచనా నిర్వహించి, అందులో భాగంగా తొలుత 75 శాతం పైగా ప్రజా అభిప్రాయం ఉన్న పది కార్యక్రమాలను గుర్తించి, వాటిని 80 శాతం పైగా సానుకూల అభిప్రాయానికి తీసుకెళ్లే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. 75 శాతం కంటే తక్కువ అభిప్రాయం ఉన్న కార్యక్రమాలపై సరిదిద్దు చర్యలు తీసుకొని పనితీరును మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. అన్ని శాఖలు నిర్దేశించిన ప్రామాణిక నమూనా ప్రకారం ఖచ్చితమైన, నవీకరించబడిన, ధృవీకరించబడిన సమాచారాన్ని సమర్పించాలని ఆమె ఆదేశించారు. జిల్లాల మధ్య సరితూగే విధంగా ఏకరీతి ప్రమాణాలు పాటించడం ద్వారా పారదర్శకత, సమర్థత, ఫలితాల ఆధారిత పరిపాలన సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

## పారిశ్రామిక భద్రతా వారోత్సవాలు

మొదటిపేజి తరువాయి

ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో కార్మికులకు ప్రత్యక్షంగా వివరించారు.

**కార్మికుల భద్రత యాజమాన్యాలకు కీలక ఆదేశాలు**

పరిశ్రమ లోపల ప్రమాద రహిత వాతావరణం కల్పించేందుకు అధికారులు ఈ క్రింది సూచనలు చేశారు:

**శిక్షణే ఆయుధం:** ప్రతి కార్మికుడికి తమ విభాగంలో ఉండే రిస్క్ పట్ల పూర్తి అవగాహన ఉండాలి. క్రమం తప్పకుండా శిక్షణా తరగతులు నిర్వహించాలి.

**పిపిఈ కిట్లు తప్పనిసరి:** పని స్వభావాన్ని బట్టి హెల్మెట్లు,సేఫ్టీ షూస్, గ్లౌజులు మరియు మాస్కులు ధరించడాన్ని యాజమాన్యాలు పర్యవేక్షించాలి.

**అనుజ్ఞా పద్ధతి:** ప్రమాదకరమైన పనులు చేసేటప్పుడు తప్పనిసరిగా అనుభవజ్ఞుడైన సూపర్ వైజర్ పర్యవేక్షణ ఉండాలి.

**ప్రజల భద్రత–కాలుష్య నియంత్రణే లక్ష్యం**

ఫ్యాక్టరీల చుట్టూ నివసించే ప్రజల ఆరోగ్య రక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు:

**వ్యర్థాల నిర్వహణ:** పరిశ్రమల నుండి వెలువడే రసాయన వ్యర్థాలు, వాయువుల వల్ల స్థానికులకు ఇబ్బంది కలగకుండా కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించాలి.

**ఆఫ్–సైట్ ఎమర్జెన్సీ ప్లాన్:** ఒకవేళ పరిశ్రమలో పెద్ద ప్రమాదం జరిగితే, చుట్టుపక్కల గ్రామస్తులను ఎలా అప్రమత్తం చేయాలి, వారిని సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలి.

**గ్రీన్ బెల్ట్ అభివృద్ధి:** పరిశ్రమల చుట్టూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

**అందరి సహకారంతోనే సురక్షిత పారిశ్రామికం**

"భద్రత అనేది ఒక రోజు చేసే పని కాదు, అది ఒక జీవన విధానం" అని డిప్యూటీ సీఐఎఫ్ నారాయణ పేర్కొన్నారు. యాజమాన్యాలు లాభాలకే కాకుండా భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాల స్ఫూర్తితో జిల్లాలోని అన్ని పరిశ్రమలు ప్రమాద రహితంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ.

## వేట్లపాలెం సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేలుడు ఘటనలో నిందితుల అరెస్ట్

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** గత నెల 28 న జరిగిన ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో నిందితులు అడబాల అర్జున్, వీరబాబుల తండ్రి శ్రీనివాసరావు మృతి చెందాడు. అనుమతులు తీసుకున్నా పరిమితికి మించి బాణాసంచా తయారి, నిల్వ చేసినట్టు గుర్తించాము. సున్నితమైన పేలుడు స్వభావం కలిగిన వాటిని సరిగ్గా హ్యాండిల్ చేయకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణం. నిందితుల పై 288, 125(ఏ) 125(బీ) 105 బిఎన్ఎస్ సహా ఎక్స్ ప్లోసివ్ యాక్ట్ 9(బీ),(ఐ),(ఖ) సెక్షన్స్ పై కేసు నమోదు చేసాము. నిందితుల ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయనేది పరిశీలిస్తున్నాము.. వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేస్తాము. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు.

# అసంపూర్తి రైతు సేవాకేంద్రాలు పూర్తి చేయాలి

**- తణుకు గోస్తని వంతెనకు కొత్త నిర్మాణం అవసరం**

**- శాసన మండలిలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ డిమాండ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో మార్చి 5వ తేదీ గురువారం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న రైతు సేవా కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి 2020 మే 30న రైతు సేవా కేంద్రాలను ప్రారంభించిందని, అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కూడా అందుకున్నారని రవీంద్రనాథ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ-క్రాప్ విధానం అమలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా, శాస్త్రీయ వ్యవసాయ సలహాలు అందించడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు.అయితే నిర్మాణంలో ఉన్న అనేక రైతు సేవా కేంద్రాలు గత రెండు సంవత్సరాలుగా నిధుల లేమితో అసంపూర్తిగా ఉండిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూఫ్ లెవెల్ వరకు పూర్తి అయిన 1458 కేంద్రాలు, పూర్తిస్థాయి నిర్మాణానికి చేరుకున్న 216 కేంద్రాలను ఇప్పటివరకు ఎందుకు హ్యాండోవర్ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దీనిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇస్తూ, సంబంధిత వివరాలు సేకరించి త్వరలోనే వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇదే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని గోస్తని నదిపై ఉన్న సుమారు 100 సంవత్సరాల పురాతన రోడ్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని రవీంద్రనాథ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రపతి రోడ్ మరియు పాతూరు ప్రాంతాలను కలిపే ఈ వంతెనకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.మహాత్మా గాంధీ రెండు సార్లు ఈ వంతెన మీదుగా ప్రయాణం చేశారని, అలాగే ఆదికవి నన్నయ్య మరియు సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాలు వంతెన ఇరువైపులా ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం వంతెన ఒక వైపుకు ఊగిపోతున్న పరిస్థితి ఉందని, ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాట్లు ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ వి.వి.అరుణశ్రీ తెలిపారు. కాకినాడ ఏటిమోగ అర్బన్ హెల్త్ సెంటర్లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు టీనేజ్ మహిళలకు వారి కుటుంబ సభ్యులు పలు అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ వి.వి. అరుణశ్రీ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా॥ ఫయాజా తస్లీమ్ దుర్రాని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ తస్లీమ్ దుర్రాని, సూపర్వైజర్ అరుణశ్రీ లు మహిళలకు టీనేజ్ మహిళలకు వారి భర్తలు, అత్త మావాలకు బాల్య వివాహల వల్లకలిగే నష్టలను, పి.సి.పి.ఎన్.డి. చట్టం, కిశోరుడు, కిషోరి లైంగిక, సురక్షిత మాతృత్వము, పి.ఎం.ఎం.వి.వై.ఎస్ వివరించారు. అదేవిదంగా పి.సి.ఓ.డి., న్యూట్రీషియన్ తదితర అంశాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ నూకరత్నం, సుజాత, సరోజనీ, దయావతి, కామేశ్వరి, సత్యకుమారి, కృష్ణకుమారి, కృష్ణవేణి భవాని, దీవేనకుమారి, ఎ.ఎన్.ఎం. శాంతకుమారి, రాణి, ఆశాలు ధనలక్ష్మీ, ఉషా తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచా నిల్వలు ధ్వంసం






**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** రూ.89 వేల విలువగల బాణసంచా సామాగ్రిని గొల్లప్రోలు పోలీసులు మరియు అధికారులు గురువారం ధ్వంసం చేశారు. చేబ్రోలు సెరికల్చర్ షెడ్ వెనుక ఉన్న ఓ పాడుబడిన భవనంలో పెద్దాపురానికి చెందిన కరక శ్రీనివాసరావు, జుట్టుక శ్రీను మరియు జుట్టుక రమేష్ లు గత సంవత్సరం అక్టోబర్ నెలలో అక్రమంగా దీపావళి బాణసంచా నిల్వ చేశారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ అప్పట్లో దాడులు నిర్వహించి రూ.89,000లు విలువైన ఆ మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు. అలా సీజ్ చేసిన ఈ పేలుడు పదార్థాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గురువారం వాటిని గొల్లప్రోలు డంపింగ్ యార్డుకు తరలించి గొల్లప్రోలు తహసీల్దార్ మరియు ఎస్సైల పర్యవేక్షణలో జేసీబీ సాయంతో పెద్ద గుంత తీసి, అందులో మందు గుండు సామాగ్రి బాక్సులను వేశారు. అనంతరం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పంపింగ్ చేసి ఆ పేలుడు పదార్థాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఆ తర్వాత వాటిని మట్టితో కప్పి సురక్షితంగా పాతిపెట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ ఆవిర్భావం ప్రపంచానికి నూతన శకం ఆరంభం

**- డాక్టర్ గోపి**




**కాకినాడ,మేజర్న్యూస్:** అంతర్జాతీయ రోటరీ సేవా సంస్థ ఆవిర్భావం ప్రపంచానికే కొత్త మార్గాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో మేలు చేసిందని, రోటరీ ఆవిర్భవించి నూట ఇరవై ఒక్క సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందని, ఇప్పటికీ అనేక లక్ష్యాలతో రోటరీ తన సేవ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోందని డాక్టర్ గోపీనాథ్ అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ద్వారా గత మూడు దశాబ్దాలకు పైగా సమాజానికి చేసిన సేవా కార్యక్రమాలను డాక్టర్ గోపి వివరించారు. సమాజానికి అవసరమైన ప్రధానంగా సకాలంలో రక్తాన్ని అందించేందుకు వీలుగా రోటరీ బ్లడ్‌బ్యాంకును స్థాపించడం లో పి.డి.జి.డాక్టర్ ఎస్.వి.ఎస్.రావు ఆలోచనకు అనుగుణంగా ఆనాడు సభ్యులందరూ సంఘటితంగా చేసిన కృషి ఫలించి నేడు వేలాదిమంది జీవితాలను కాపాడిన ఆత్మ తృప్తి కలిగి ఒదన్నారు. రోటరీ వృద్ధాశ్రమ ఏర్పాటులో అప్పటి క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంకు అనుబంధంగా ఉన్న హెల్త్ కేర్ సెంటర్లో ఏర్పాటు చేసిన రోటరీ చేయూత భవన్ బడుగుచ బలహీనవర్గాల పిల్లలకు, నిరాశ్రులైనవారికి ఆశ్రయాన్ని కల్పించడంతోపాటు వారి జీవిత రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఆ కమిటీ చైర్మన్ డాక్టర్ మొండి రవికుమార్ టీం అభినందనీయమని అన్నారు. 1905లో పాల్ పి హారీస్ అనే ఒక వ్యక్తి రోటరీ సంస్థను స్థాపించడం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కోట్లాదిమంది రోటరీ సభ్యులుగా ఉంటూ ప్రతిరోజూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని డాక్టర్ గోపీనాథ్ గుర్తు చేశారు.

## అభాగ్యులకు ఆపన్న హస్తం అక్షయ సేవ సమితి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఐ.పోలవరం మండలం ఎర్ర గరువు గ్రామానికి చెందిన నీతి పూడి పల్లపురావు ఇల్లు గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి ఇల్లు మొత్తం కాలిపోయింది. పల్లపు రావు కుటుంబం కట్టుబట్టలు తప్ప ఇంకేమీ మిగలలేదని, గ్రామ పెద్దలు అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా పల్లపు రావు అక్షయ సేవా సంస్థ సభ్యుల చేతుల మీదుగా 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.

## శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతరకు పందిరి రాట



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కాండ్ర కోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారు జాతర మహోత్సవాలు పురస్కరించుకుని గురువారం దేవస్థానం ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ లొల్ల సత్యనారాయణ, పాలక మండలి సభ్యులు, గ్రామ నాయకులు, ఆసాదులు, వేదపండితులు, సిబ్బంది, పాల్గొన్నారు.

www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# భజన కళాకారులకు ఆర్థిక చేయూత

**– పాల్గొన్న భజన కళాకారుల సంఘ సభ్యులు**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఇటీవల కాలంలో పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన డోలక్ వాయిద్య కళాకారుడు వింజరపు శ్రీను ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ మరియు జి.రాగంపేట గ్రామ టిడిపి అధ్యక్షులు జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ) గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం సభ్యులు, ఓంశక్తి మహిళాభజన సమాజం సభ్యులు సమకుర్చిన ఆర్థిక సహాయం చేశారు. దీనిలో భాగంగా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం, ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీ విజయదుర్గ గనిలక్ష్మీ మహిళా భజన సమాజం సభ్యురాలు చిలకలపల్లి రమాదేవి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, సంఘం నుండి వారికి రూ.5 వేలు, పాలకవర్గ సభ్యులు సొంతంగా మరో రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు ఎలిశెట్టి కామరాజు, సంఘ గౌరవాధ్యక్షులు గోపు సూరిబాబు, సంఘ జాయింట్ సెక్రటరీ లు మాట్లాడుతూ హిందూ మత ప్రచారంలో విఘ్నేశ్వర భజన కళాకారుల సంఘం ఎంతో కృషి చేస్తుందని, ఇటువంటి తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం ఎంతో విచారక రమని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవార్కి సంఘం తరపున ఇతోధికంగా సహాయ పడడం తమ వంతు కర్తవ్యమని, వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంచాది రామకృష్ణ, డైరెక్టర్లు కరెడ్ల వెంకటరమణ(కవి), జువ్వల వీరలక్ష్మీ, సంఘ సభ్యులు కొప్పిశెట్టి నాగబాబు, పాలా రామారావు, భజన గురువులు చెందుర్తి సత్యనారాయణ, మరియు భజన కలాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీతో ఆర్థిక అభివృద్ధి పెరుగుదల

**– శాసనసభలో వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీతో ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి పెరుగుదలకు తోడ్పాటు జరుగుతుందని, ఆంధ్ర రాష్ట్ర జనాభా ఐదు కోట్లకు తగ్గకుండా నిర్వహిస్తేనే తెలుగుజాతి శక్తివంతమైన జాతిగా నిలుస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు శాసనసభలో ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభలో ప్రవేశపెట్టిన పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీలో భాగంగా అమలు చేయబోతున్న జనాభా పెరుగుదల, ఉమెన్ ఎంపవర్మెంట్, చైల్డ్ కేర్ సెంటర్స్ ఏర్పాటు తదితర అంశాలపై వనవాడి కొండబాబు ప్రసంగిస్తూ పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ అమలపై ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జనాభా పెరుగుదలతోని రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి పెరుగుతుందని, ప్రపంచంలో తెలుగుజాతి శక్తివంతమైన జాతిగా నిలవాలంటే ఆంధ్ర రాష్ట్ర జనాభా 5 కోట్లకు తగ్గకుండా మేనేజ్మెంట్ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ అమలుపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రతి ఒక్కరూ సహకరించడం జరుగు తుందని, పూర్వకాలం పెద్ద కుటుంబాలకు అధిక ప్రాధాన్యత ఉండేదని, ప్రతి కుటుంబంలో ఐదుగురుకు మించి, 10 మంది వరకు సంతానం కలిగి ఉండేవారని, ఎక్కువమంది సంతానం కలిగి ఉన్న పెద్ద కుటుంబాలతో సంబంధాలు కలుపుకునే వివాహాలు జరిపించేవారని, నేడు ఒకరు ఇద్దరు పిల్లలతోనే జీవనం సాగిస్తున్నారని, దీని వలన జనాభా తగ్గుదలతో పాటు కుటుంబాల మధ్య సత్సంబంధాలు అంతగా ఉండటం లేదని, జనాభా పెరుగుదలపై పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీలో భాగంగా జనాభా పెరుగుదలపై, ఉమెన్ ఎంపవర్మెంట్, చైల్డ్ కేర్ సెంటర్స్, షీ కాబ్స్, పింక్ టాయిలెట్స్, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని కొండబాబు పేర్కొన్నారు.

# నిమ్మసాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

**– పలు తెగుళ్లపై రైతులకు అవగాహన**

**– ఉద్యానవనశాఖ ప్రధాన శాస్త్రవేత్త డా.పి.అశోక్**



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** నిమ్మతోటల సాగులో వచ్చే తెగుళ్లు పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంబాజీపేట ఉద్యానవనశాఖ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.పి.అశోక్ అన్నారు. గురువారం మండలంలోని వానపల్లి శివారు నారాయణ లంకలో నిమ్మ రైతులకు అవగాహన కల్పించారు. నిమ్మతోటల్లో సంవత్సరం పొడవునా పూత, పిందె వున్నప్పటికీ, వేసవిలో వచ్చే కాపుకు అధిక డిమాండ్ వుండటంతో రైతులు, జనవరి నుండి వచ్చే పూతకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. నిమ్మ తోటల్లో అధిక దిగుబడి సాధించేందుకు అనువైన మేలైన రకాలు, పూత దశలో చేపట్టాల్సిన యాజమాన్యం గురించి తెలియజేసారు. రైతులు నిమ్మతోటల్లో కొమ్మ కత్తిరింపు తప్పనిసరి చేయాలన్నారు. 8 సంవత్సరాలు పైబడిన తోటల్లో పనికిరాని కొమ్మలను కత్తిరించాలన్నారు. సూర్యరశ్మి అందే విధంగా ఉండడం వల్ల చీడపీడలు తగ్గేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం వచ్చే పూత నుండి అధిక దిగుబడి సాధించాలంటే నీటి యాజమాన్యం,పోషకాల విషయంలో రైతులు తగిన శ్రద్ధ పెట్టాలని సూచించారు. నిమ్మతోటల్లో ప్రధాన సమస్య గజ్జి తెగులు బాక్టీరియా వల్ల సోకే ఈ తెగులు సంవత్సరం పొడవునా ఈ తెగులు తోటల్లో కనిపించి దిగుబడిని దెబ్బతీస్తూ ఉంటుందని, ఈ తెగులు లక్షణాలను గమనిస్తే ఆకులు,కొమ్మలు,కాయలపై గరుకుగా వున్న ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడతాయని అన్నారు. దీనివల్ల ఆకులు క్రమేపి పండుబారి రాలిపోయి,కాయలు నాణ్యత కోల్పోతాయని అన్నారు. ఎప్పటికప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండి సరైన సమయాల్లో సంబంధించిన మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి జి.కోటేశ్వర రావు,నిమ్మరైతు చోడపనీడి సత్యనారాయణ ఉన్నారు.

## ఈతకోటలో 'విష్ణు డెంటల్ 50వ క్లినిక్' ప్రారంభం



**పెరవలి, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పేదలు మరియు మధ్యతరగతి ప్రజలకు చౌకగా నాణ్యమైన దంత వైద్యం అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సౌకర్యాలతో దంత వైద్యశాలలను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నామని విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కె.వి.విష్ణు రాజు అన్నారు. మార్చి 5వ తేదీ గురువారం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఈతకోట గ్రామంలో బైరాజు ఫౌండేషన్‌కు చెందిన భవనంలో ఏర్పాటు చేసిన విష్ణు డెంటల్ 50వ క్లినిక్ ను విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె.వి. విష్ణు రాజు ప్రారంభించారు. విష్ణు దంత వైద్య కళాశాల భీమవరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యాధునిక వసతులు, నైపుణ్యంతో కూడిన వైద్య సిబ్బందితో దంత వైద్యశాలలను ప్రారంభించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని చైర్మన్ కె.వి విష్ణురాజు అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామరాజుతో పాటు వైద్య సిబ్బంది డాక్టర్ వినయ్, డాక్టర్ ఆర్.వి.రాజు, డాక్టర్ కార్తీక్ వర్మ, డాక్టర్ రమేష్, డాక్టర్ చైతన్య, రవికుమార్, రాఘవ రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈతకోట మరియు పరిసర గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన దంత వైద్య సేవలు అందించేందుకు ఈ క్లినిక్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## 'బాపనమ్మ' జాతర మహోత్సవాలు పోస్టర్ విడుదల



రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం మండలం సీతపల్లి మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పోస్టర్ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి గురువారం విడుదల చేసారు. సీతపల్లి జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే శిరీషాదేవి రూ.1,00,000 లు విరాళం అందజేశారు. సీతపల్లి గ్రామంలో వేంచేసియున్న మాతృశ్రీ గడిబాపనమ్మ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాలు ది 14-3-2026వ తేదీ నుండి 18-3-2026వ తేదీ వరకు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో అమ్మవారి జాతర మహోత్సవ ఆహ్వాన శుభ పత్రిక మొదటిగా రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి విజయ్ భాస్కర్ దంపతులకు అందజేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయ బద్ధ పండుగలే దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా ఉంటాయన్నారు. రంపచోడవరం మండలం సీతపల్లి శ్రీ గడి బాపనమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 18వ తేది వరకు జాతర మహోత్సవాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించవలసిందిగా తెలియజేసారు. బాపనమ్మ అమ్మవారు అత్యంత పురాతన ప్రాచుర్యం పొందిన అమ్మవారిని నియోజకవర్గంలో ప్రజలే కాకుండా రెండు రాష్ట్రాల్లోని ప్రజలు అమ్మవారిని దర్శించుకుంటారని కాబట్టి ఆలయ అభివృద్ధి, ఆయా తేదీల్లో నిర్వహించే పలు సాంస్కృతిక కార్యక్రమాలకు తన వంతుగా రూ.1,00,000లు విరాళంగా అందజేశారు. అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, సిబ్బందికి హామీ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అత్యంత పారదర్శకంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ గడి బాపనమ్మ అమ్మవారి చైర్మన్ కుంజం బాపన్న దొర, ఆలయ డైరెక్టర్ సత్య సుందరరావు, ఆలయ అర్చకులు బత్తిన రామ కోటేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి జి.సత్య రమేష్ పాల్గొన్నారు.

# శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యం..

## సూర్యారావుపేట రామయ్య 'గాలిగోపురం'!






- శిలా ఫలకం సాక్షిగా 200 ఏళ్ల ఆధ్యాత్మిక ప్రస్థానం
- నక్షత్రాల వారీగా నారాయణుడికి నీరాజనం!
- ఆధ్యాత్మిక మకుటమై వెలుగొందుతున్న సీతారాముల క్షేత్రం

**అది సుమారు రెండు శతాబ్దాల క్రిందటి మాట.. భక్తాగ్రేసరుడైన ఒక సామాన్యుడి గృహంలో ఆవిర్భవించిన రామయ్య, నేడు కాకినాడ నగరానికే ఆధ్యాత్మిక మకుటమై వెలుగొందుతున్నారు. కాలాన్ని వెక్కిరిస్తూ నిలిచిన ఐదంతస్తుల గాలిగోపురం, అణువణువూ భక్తిని రగిలించే శిలా ఫలకం సాక్షిగా.. ఈ క్షేత్రం కేవలం రాతి కట్టడం కాదు, తరతరాల నమ్మకానికి సజీవ వారసత్వం. ఖగోళ శాస్త్రంలోని నక్షత్ర మండలాన్నే అర్చనగా మార్చుకున్న ఈ రామాలయ వైభవం, భక్తుల గుండెల్లో ఒక పవిత్ర కావ్యం!దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో కొమ్మన సతీష్ అందించిన ప్రత్యేక కథనం..**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**




కాకినాడ నగర గుండెకాయ వంటి సూర్యారావుపేటలో వెలసిన శ్రీ సీతారామస్వామి వారి ఆలయం కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, శతాబ్దాల కాలంగా సాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రస్థానానికి సజీవ సాక్ష్యం. తరతరాలుగా భక్తుల కష్టాలను కడతేరుస్తూ, వారి నమ్మకాన్ని బలపరుస్తున్న ఈ చారిత్రక క్షేత్రం యొక్క ఆవిర్భావం మరియు వికాసం అత్యంత ఆసక్తికరం. ఆలయ ప్రాంగణంలోని శిలా ఫలకం మరియు ముఖద్వారం వద్ద ఉన్న గంభీరమైన గాలిగోపురం ఈ క్షేత్ర మహత్యాన్ని మూగగానే చాటిచెబుతున్నాయి.

**శిలా ఫలకం ఏం చెబుతోంది? - ఆవిర్భావ చరిత్ర**

ఆలయ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలనే సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన శిలా ఫలకం ప్రకారం, ఈ క్షేత్రం సుమారు 1825-1830 మధ్య కాలంలో ఆవిర్భవించింది.

- భక్తుడి సంకల్పం: నాటి పరమ భక్తుడు పాతాల ముందరరామయ్య గారు తన నివాస గృహంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధించేవారు.

**గ్రామస్థుల సహకారం:** తదనంతరం, గ్రామస్థులు మరియు ప్రముఖుల సహకారంతోఈ క్షేత్రం రూపుదిద్దుకుంది. శతాబ్దాల కాలంగా ఈ క్షేత్రం సూర్యారావుపేటభక్తులఅచంచలవిశ్వాసానికికేంద్రబిందువుగా నిలిచింది.

**పవిత్ర ప్రతిష్ఠ:** శిలా ఫలకం ప్రకారం, ఈ ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు అత్యంత పవిత్రమైన ఆగమ శాస్త్రాల ప్రకారం, ధార్మిక కోవిదుల సమక్షంలో ప్రతిష్ఠించబడ్డాయి.

**నక్షత్ర మండలార్చన- ఖగోళ శాస్త్రానికి ఆధ్యాత్మిక వారసత్వం..**ఈ క్షేత్రం యొక్క మరో అద్భుత విశిష్టత ఇక్కడ నిర్వహించే నక్షత్ర పూజలు. శిలా ఫలకంలోని సమాచారం ప్రకారం, ఇక్కడ 27 నక్షత్రాలకు అనుగుణంగా స్వామివారికి విశేషార్చనలు జరుగుతాయి.

**నక్షత్ర పూజలవిశిష్టత:**ప్రతి మాసము నందు భక్తుల నక్షత్రాలకు అనుగుణంగా విశేష అలంకారములు,నైవేద్యములు నిర్వహించే సాంప్రదాయం ఇక్కడ ఉంది.

**శాస్త్రీయత:** పూజ అంటే కేవలం హారతి మాత్రమే కాదు, అది ఒక శాస్త్రీయ క్రతువు అని ఈ నక్షత్ర పూజల విశ్లేషణ ద్వారా స్పష్టమవుతోంది. భక్తులు తమ జన్మ నక్షత్రం రోజున స్వామివారిని దర్శించుకుంటే గ్రహ దోషాలు తొలగి, రామయ్య అనుగ్రహం లభిస్తుందని ప్రగాఢంగా విశ్వసిస్తారు.

**శిల్పకళా చాతుర్యం - 5 అంతస్తుల గాలిగోపురం**

ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న 5 అంతస్తుల గాలిగోపురం భక్తులను భక్తిభావంలో ముంచెత్తుతుంది.

**నిర్మాణ కాలం:** శిలా ఫలకం ప్రకారం, ఈ సుందరమైన తూర్పు వైపు గాలిగోపురాన్ని సుమారు 1905 ప్రాంతంలో 5 అంతస్తులతో అత్యంత గంభీరంగా నిర్మించారు.

**శిల్పకళ:** ఈ పంచ భూమికల 5 అంతస్తుల గోపురంపై రామాయణ గాథలకు సంబంధించిన వివిధ దేవతా మూర్తుల శిల్పాలు కనువిందు చేస్తాయి.

**చారిత్రక వారసత్వం:** గత వంద ఏళ్లకు పైగా ఈ గోపురం తన ఉనికిని చాటుకుంటూ, రామయ్య పాదాల చెంతకు వచ్చే లక్షలాది మంది భక్తులకు స్వాగతం పలుకుతోంది.

**సాంస్కృతిక వారసత్వం - నిత్య కల్యాణం.. పచ్చ తోరణం**

శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రం కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది నగర సాంస్కృతిక ప్రస్థానంలో కూడా కీలక పాత్ర పోషించింది. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో జరిగే పంచామృత అభిషేకాలు,నైవేద్యాలు మరియు ధూపదీప నైవేద్యాల వివరాలు కూడా ఆ ఫలకంలో పొందుపరిచారు.

**ఇలయం చారిత్రక మకుటం..**కాకినాడ సూర్యారావుపేటలోని శ్రీ సీతారామస్వామి ఆలయం నగరానికి ఒక చారిత్రక మకుటం. శిలా ఫలకం సాక్షిగా 200 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ క్షేత్రం, శతాబ్దాల కాలంగా తన ఉనికిని చాటుకుంటూ, రామయ్య పాదాల చెంతకు వచ్చే భక్తులకు భరోసానిస్తోంది. ఈ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నది అక్షర సత్యం.

## కాకినాడ సెజ్ భూములు

# రైతులకు తిరిగి అప్పగింపు

**- అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లాలో సెజ్‌కు చెందిన భూములను తిరిగి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసి ఆయా రైతులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో భూమినిసెజ్‌పరిధిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూములను అర్హత గల రైతుల వారి పేర్లపై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించే చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రత్రాలపై స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూములు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, దస్తావేజులు, ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే నోటీసుల వివరాలు అన్ని మార్చి 13 నాటికి ఆయా మండలాల తహాశీల్దార్ల కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెజ్ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సెజ్ భూములు రైతులు పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో డీఆర్ఓ తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, ఎన్. శ్రీధర్, జిల్లా రిజిస్టర్ కె. ప్రసాద్ రావు, కాకినాడ రూరల్, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల తహాశీల్దార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త దంపతులకు ఘన సత్కారం



రంపచోడవరం, మేజర్ న్యూస్ : పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త దంపతులకు ఘన సత్కారం జరిగింది. గత 30 సంవత్సరాల కాలంగా స్థానిక వ్యాపార సంస్థలో భాగస్వామిగా ఉంటూ ఇక్కడే కుటుంబంతో సహా నివాసం ఉంటూ గత 10 సంవత్సరాల కాలంగా హిందూ ధార్మిక క్రమాలు నిర్వహించిన రంపచోడవరం ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయ కర్తగా విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ ప్రముఖ్‌గా, తితిదే గోవిందగిరి శ్రీవారి సేవక బృందం సమన్వయకర్తగా సేవలు అందించిన నల్లమిల్లి వేంకటరామారెడ్డి, శ్రీమతి మంజు (బలభద్రపురం) దంపతులను స్థానిక జీవికె అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో వి.హెచ్.పి. కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక హిందూ ధార్మిక సంస్థల కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

కొన్ని వ్యక్తి గత కారణాలతో తమ స్వంత గ్రామం దగ్గరలో ఉన్న రాయవరం మండలం వి.సావారం తిరిగి వెళుతున్న సందర్భంగా వి.హెచ్.పి రాష్ట్ర సభ్యులు భావన్నారాయణ, ఆధ్వర్యంలో నారాయణగిరి అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు వేదాశీర్వచం అందించగా జిల్లా, మండల సభ్యులు, గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, ఎర్రా ఆనందరావు, బెజవాడ వేంకటేశ్వరరావు, వెలిశెట్టి వీరభద్ర ప్రసాద్, అన్నవరెడ్డి కృష్ణకిశోర్, లీలానాగు వీరభద్రగుప్తా పావని దంపతులు, కారంసత్యవేణి, జొన్నలగడ్డ బాలయ్య, హెచ్ యం, ఎన్.శ్రీనివాసరావు, టీచర్స్, స్కూలు సిబ్బంది పాల్గొని సన్మానం చేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వేంకటరామారెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 30 సంవత్సరాల పాటు భగవంతుని సేవలో ఉన్నాను అంటే ఆదివాసీ సోదరులు అందించిన ప్రేమ అభిమానాలు వెలకట్టలేనివి అని, హైందవ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించాలి అని సహచర మిత్రులకు విన్నవించారు. ముఖ్యంగా మీడియా సోదరుల సహాయం మరువరానిదని కృతజ్ఞతలు తెలియ చేసారు.

## లీడర్ టు కేడర్ మై టిడిపి యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం

– బొల్లా పుల్లయ్య, కణితి మధు



ఎటపాక, మేజర్ న్యూస్ : పోలవరం జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఆదేశాలు రంపచోదవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిర్యాల శిరీష భాస్కర్ ఆదేశాలతో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తల ఆధ్వర్యంలో "మై టీడీపీ యాప్" ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది. రాష్ట్రం నుంచి బూత్ స్థాయి వరకు జరిగే పార్టీ కార్యక్రమాలు, సమాచారం,సూచనలు క్షణాల్లో కార్యకర్తలకు అందించేందుకు రూపొందించిన మై టీడీపీ యాప్‌ను ప్రతి కుటుంబ సభ్యుడు తమ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలోని టీడీపీ కుటుంబ సభ్యులకు యాప్ యొక్క ఉపయోగాలు వివరించారు.పోస్టర్‌లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. యాప్ ద్వారా పార్టీ సమాచారం, కార్యక్రమాల వివరాలు, నాయకుల సందేశాలు, సభ్యత్వం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని చెప్పారు.గ్రామంలో పలువురు కార్యకర్తలు ఇప్పటికే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇతరులకు కూడా తెలియజేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. చివరగా ప్రతి టీడీపీ కుటుంబ సభ్యుడు మై టీడీపీ యాప్‌ను తప్పకుండా డౌన్‌లోడ్ చేసుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి రమేష్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, దమ్మల పాపారావు, సయ్యద్ కరీం, మాజీ సర్పంచ్ పెనుబల్లి సీతయ్య, శ్యామల రాజేష్, గాంధీ, సోడి భీమయ్య, జనసేన నాయకులు మొల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణన ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం

– ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహణ



కాకినాడ, మేజర్ న్యూస్ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియ కు సంబంధించి జిల్లా స్థాయిలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు నిర్వహించే జనాభా గణన శిక్షణ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తమ ల్యాప్ టాప్ లతో సహా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మొదటిదశ గృహాల జాబితా మరియు గృహ వసతుల గణనపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## జడ్డంగి పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం




రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మహిళా సాధికారత వారోత్సవాల సందర్భంగా జడ్డంగి ఏపిటిడబ్ల్యుజిహెచ్ పాఠశాలలో విద్యార్థినుల కోసం స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు అత్యవసర మరియు ప్రమాదకర పరిస్థితుల్లో ధైర్యంగా ఎలా స్పందించాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అలానే రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్థానిక ఎస్సై శివకుమార్ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జడ్డంగి చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ మరియు వాహన పత్రాలు లేకపోవడం వంటి ఉల్లంఘనలపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఎస్ఐ చిన్నబాబు ఎం వి చలాన్లు విధించారు.

# గోకవరం మండలానికి చేరిన పెద్దపులి





– ప్రజలు భయాందోళనలు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : గత కొద్ది రోజులుగా ఏజెన్సీ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పెద్దపులి కదలికలు గోకవరం మండలంలో గురువారం కనిపించినట్లు సమాచారం. గత నెలలో కుర్నాపురం దగ్గర పట్టుబడిన పెద్దపులిని అటవీ శాఖ అధికారులు పాపికొండలు అభయారణ్యంలో విడిచిపెట్టిన తర్వాత రంపచోడవరం అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల సరిహద్దుల్లో సంచరించి, గంగవరం మండలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. రంపచోడవరం గంగవరం మండలాల పరిధిలోని పలు గిరిజన గ్రామాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో సంచరించిన పెద్దపులి గురువారం గోకవరం మండలంలోకి ప్రవేశించినట్లు తెలుస్తుంది. గోకవరం మండలం మల్లవరం ట్యాంకు బీడు ప్రాంతాల్లో పులి పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు ఆ ప్రాంతంలోనే పులి సంచరిస్తున్నట్లు తెలుసుకొని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పులి కదలికలను ధ్రువీకరించారు. పెద్దపులిని మరలా రిస్క్యూ ఆపరేషన్ చేసి పట్టుకుంటామని ఆ తర్వాత జంతు సంరక్షణ కేంద్రానికి లేదా దూరంగా అటవీ ప్రాంతాలకు తరలిస్తామని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజులు క్రితం రంపచోడవరం మండలం పెద్దకొండ, తాళ్లపాలెం అటవీ ప్రాంతాల్లో పశువులపై దాడి చేసిన పెద్దపులి మళ్లీ ఎక్కడ గ్రామాలపై దాడి చేస్తుందో నని ప్రజలు భయపడుతున్నారు. అయితే అటవీ ప్రాంతాల్లో పులి కదలికలను గమనిస్తున్నామని, ఇప్పటివరకు గ్రామాల్లోకి పులి చొరబడలేదని అటవీశాఖ అధికారులు అంటున్నారు. మరోవైపు పులి సంచారంతో గోకవరం మండలంలో మల్లవరం, ట్యాంకు వీడు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా తిరగవద్దని గ్రామాల్లో దండోరా వేస్తున్నారు. గ్రామాల చుట్టూ అటవీ ప్రాంతాల్లో పులి సంచారం వల్ల ప్రజలు స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెద్దపులిని పట్టుకుని దూరప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## జయరామరాజుకు ఏఎస్ఐగా పదోన్నతి




ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో గత మూడు సంవత్సరాలుగా కోర్టు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి జయ రామ రాజు ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. 1990 సంవత్సరంలో పోలీస్ కానిస్టేబుల్‌గా తూర్పుగోదావరి జిల్లాలో రిక్రూట్ అయ్యినారు. గత 36 సంవత్సరాలు కానిస్టేబుల్ మరియు హెడ్ కానిస్టేబుల్ సర్వీస్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ టీ.గణేష్, ఎస్ఐ హరిబాబు మరియు సిబ్బంది మిత్రులు రామరాజును అభినందించారు.

## మహిళ అనుమానాస్పద మృతి



ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : ధవళేశ్వరం గ్రామంలో స్థానిక క్వారీ కెనాల్ రోడ్‌లో బత్తిన సుబ్బారావు నగర్‌కు చెందిన శీలంశెట్టి నాగవర్ష ఇంట్లో సీలింగ్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివాహం అయ్యి 14 సంవత్సరాలు అయ్యిందని ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఈమె భర్త శరత్ చెప్పారు.

ఇంట్లో వృద్ధాప్యంలో వున్న అత్త మావయ్యలకు సేవ చేయలేక పోతున్నానని తరచు బాధపడుతూ ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

మృతురాలు అన్న శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ధవళేశ్వరం పోలీసులు తెలిపారు.

# కాలువల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**– అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లమిల్లి**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు మరియు పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని పంట కాలువలు, మురుగు కాలవలు చాలా అధ్వాన్న స్థితిలో ఉన్నాయని, కాలువల్లో గుర్రపు డెక్క, తూడు ఎక్కువగా పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉందని కాలువలో పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుని రైతాంగానికి అండగా నిలవాలని అసెంబ్లీలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అంతేకా కుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తుల్యభాగ డ్రెయిను, కేకే డ్రెయిను, కంకణాల డ్రెయిను, బిక్కవోలు డ్రెయిను, వెస్ట్ ఏలేరు డ్రెయిన్ ఇవన్నీ ప్రధానమైన డ్రెయిన్లు. వీటన్నిటిలోనూ పూడిక తీయకపోవడం వల్ల గత 30 సంవత్సరాలుగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆ సమస్యను కూడా పరిష్కరించాలని అన్నారు. ఆక్రమణల విషయాలకు వస్తే అనపర్తి నియోజకవర్గం నుండి కాకినాడ రూరల్ ద్వారా బే ఆఫ్ బెంగాల్ వెళ్లే బిక్కవోలు డ్రెయిను, వెస్ట్ ఏలేరు డ్రెయిన్ ఇది మా నియోజకవర్గంలో ఒకచోట కలిసి కాకినాడ రూరల్ ద్వారా బే ఆఫ్ బెంగాల్లో కలుస్తాయని, కాకినాడ మేడ లైన్ ప్రాజెక్టుకు సంబంధించిన బ్రిడ్జి ఒకటి నిర్మించారో అది పూర్తిగా అలైన్మెంట్ మార్చేసి ఫ్లో అడ్డుకునేలా నిర్మించడం వల్ల అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం ముంపునకు గురవుతుందని , ఇరిగేషన్ అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ దానిపైన చర్య తీసుకోలేదని అన్నారు.

ఆక్వా కల్చర్ నుండి వచ్చే వేస్ట్ వాటర్ అంతటిని పంటకాలవల్లోకి పెట్టడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతు ఁదని, దాన్ని మురుగు కాలవలోకి పంపేలా చర్యలు తీసుకోవాలి. మేజర్ డ్రైన్లు, మీడియం ఁ మైనర్ డ్రైన్లు తూర్పుగోదావరి జిల్లాలో చాలా ఎక్కువగా ఉన్నాయని ,వీటన్నిటిలోనూ పూడిక తీయించి గోదావరి డెల్టా మోడరనైజేషన్ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. పొల్యూషన్ కూడా కంట్రోల్ పై దృష్టి పెట్టాలని, డెడికేటెడ్ డ్రెయిన్ ద్వారా బే ఆఫ్ బెంగాల్లోకి పంపడం ద్వారా రైతులను కాపాడవచ్చని పొల్యూషన్ కంట్రోల్ చేయవచ్చని అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అనపర్తి నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సింగారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ శివారు అటవీప్రాంతంలో వేంచేసి ఉన్న శ్రీ సింగారమ్మ అమ్మవారికి మూడోరోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి, కుమారుడు అనీష్ నెహ్రూ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. మల్లిశాల గ్రామ వాసుల ఆరాధ్య దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధి కెక్కారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో అమ్మవారి జాతరను ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. గురువారం అమ్మవారిని వేలాదిమంది దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. సింగారమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మొక్కులు తీర్చుకొని ఆలయ ఆవరణలో ఆనందంగా గడిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనేకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీని నిర్వాహకులు పైడిపాల సూరిబాబు, ముంద్రు ఎర్రబాబు,పాలికిరెడ్డి సత్యనారాయణ, నక్కరాజు వీరబాబు, కుప్పల నాగు తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే ఆలయ ప్రాంగణంలో మహానేత బసిరెడ్డి విగ్రహం

**–మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి**



**బిక్కవోలు, మేజర్ న్యూస్ :** మహనీయుడు, మహా అన్నదాత, దానశీలుడు, ఉషా ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని అత్యద్భుతంగా నిర్మించిన అపార దానధర్మాలతో పేరు గాంచిన గొల్లల మామిడాడ గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు కొవ్వూరి బసివిరెడ్డి విగ్రహం సూర్యనారాయణమూర్తి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తున్నారని, రానున్న రోజుల్లో మేము అధికారంలోకి రాగానే ఆలయ ప్రాంగణంలో స్వర్గీయ కొవ్వూరి బసివిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కానీ, ప్రస్తుత పదవీకాలంలో మొదటి రెండేళ్లలో కానీ బసివిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని ఆలోచన రాలేదని, అదే గ్రామంలో ఎన్.టి. రామారావు, నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాల ఏర్పాటుకు దిమ్మెలు కట్టించినప్పుడు గానీ, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌కు మూలారెడ్డి పేరు పెట్టినప్పుడు గానీ బసివిరెడ్డి గుర్తుకు రాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. చింతా దొరబాబు తన సొంత ఖర్చులతో, సన్నిహితుల సహకారంతో కొత్తపేట శిల్పి వడెయార్ వారి ద్వారా విగ్రహం తయారీకి ఆర్డర్ ఇచ్చి పనులు పూర్తి చేసిన తర్వాత, ఆ క్రెడిట్ తమకు దక్కదనే భయంతోనే ఎమ్మెల్యే ఇప్పుడు వివిధ రకాల అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఒక గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఎవరైనా ముందుకు వస్తే వారిని అభినందించాల్సింది పోయి ఆటంకాలు సృష్టించడం తగదు అన్నారు. ఆలయ రూపకర్త అయిన బసివిరెడ్డి వారి విగ్రహాన్ని అదే ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించడంలో అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విగ్రహం కోసం ఎటువంటి అధికారిక ఆర్డర్ ఇవ్వలేదని, కేవలం అసెంబ్లీలో మాట్లాడి క్రెడిట్ చోరీ చేసే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.బసివిరెడ్డి విగ్రహాన్ని సూర్యనారాయణ మూర్తి ఆలయ ప్రాంగణంలోనే ప్రతిష్ఠించేందుకు తక్షణం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిస్వార్థంగా ఈ బృహత్ కార్యానికి పూనుకున్న చింతా దొరబాబు, వారి మిత్రబృందాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని అన్నారు.

## లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో తుమ్మలపల్లి ప్రత్యేక పూజలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక విష్ణాలయంలో గురువారం లక్ష్మీదేవి అమ్మవారి జన్మదినం సందర్భంగా జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మపల్లి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ రమేష్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, జీను బాబ్జి, బీటీ ప్రసాద్, మాదారపు వీరబాబు, కుంచె రాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి - అధిక రాబడి

**– పిఠాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి గంగాధర్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి – అధిక రాబడి సాధించవచ్చునని పిఠాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి గంగాధర్ అన్నారు. పిఠాపురం మండలం రాయవరం గ్రామంలో గురువారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. మట్టి, ఆముదం, కుంకుడుకాయలను ఉపయోగించి 'మట్టి ద్రావణం' తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. వ్యవసాయ అధికారి గంగాధర్ మాట్లాడుతూ... ఈ ద్రావణం పంటలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని, "మట్టి ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు అందడమే కాకుండా, తెగుళ్లు మరియు పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చునని అన్నారు. ఇటువంటి సహజసిద్ధమైన పద్ధతులను అవలంబించడం వల్ల సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని, నాణ్యమైన దిగుబడి సాధించడంతో పాటు భూసారాన్ని పెంపొందించుకోవచ్చని, తద్వారా పర్యావ రణం తో పాటు మానవ ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చని వివరించారు. రైతులు పండించిన ధాన్యం నాణ్యత పరీక్షలు పూర్తయిన తర్వాత, అర్హులైన రైతులకు జీ గ్యాప్ (గ్రూప్ సర్టిఫికేషన్ అందజేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 10 వరకు జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 26వ తేదీన జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రారంభమైన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 10వ తేదీతో ముగుస్తుందని ఆ పార్టీ అడ్డతీగల మండల సీనియర్ నాయకుడు కొప్పాల జయరాం తెలిపారు. పదవ తేదీ లోపల ఇప్పటి వరకు ఉన్న జనసైనికులు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాలని అలాగే కొత్త సభ్యులు ఎవరైనా ఉంటే నమోదు చేయించుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుకి సభ్యుని ఆధార్ కార్డుతో పాటు నామిని ఆధార్ కార్డు శాశ్వత ఫోన్ నెంబర్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు 400 రూపాయల సంవత్సర కాల పరిమితి చందా చెల్లించాలని సూచించారు.

సభ్యత్వం పొందిన సభ్యులు ప్రమాద కారణంగా మరణించిన పూర్తి అంగవైకల్యం సంభవించిన వెంటనే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా పార్టీ తరఫున చెల్లిస్తామని సూచించారు. అడ్డతీగల మండల లో సభ్యత్వ నమోదు కావలసినవారు తనతో పాటు పొడుగు సాయి తాటికొండ రాజేంద్ర పల్లాల రవి ముత్యాల సురేష్‌లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ప్యారి షుగర్స్ కార్మికుల ఆందోళన విరమణ





- పరిశ్రమ మూతపడదు.. ఉపాధికి ఢోకా లేదు
: యాజమాన్యం స్పష్టమైన హామీ
- మూడు గంటల పాటు నిలిచిన ఉత్పత్తి
- నష్టపరిహారంపై హెచ్ఆర్‌తో చర్చలు సఫలం
- హర్షం వ్యక్తం చేసిన కాంట్రాక్ట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** స్థానిక వాకలపూడిలోని ప్యారి సుగర్స్ రిఫైనరీ పరిశ్రమలో గత కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. పరిశ్రమ మూసివేతపై వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో, తమ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం భారీ ఆందోళన చేపట్టారు. బి-షిఫ్ట్ కార్మికులు విధులను బహిష్కరించి సుమారు మూడు గంటల పాటు ఉత్పత్తిని నిలిపివేయడంతో ఉద్రిక్తత నెలకొంది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**పరిశ్రమ మూసివేసే పక్షంలో కార్మిక చట్టాల ప్రకారం తమకు ముందస్తు నోటీసులు ఇవ్వాలని, అలాగే ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు ఒక సంవత్సరం వేతనాన్ని నష్టపరిహారంగా చెల్లించాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. తమ గోడును యాజమాన్యం వినాలని, భరోసా ఇచ్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని కార్మికులు భీష్మించారు.

**యాజమాన్యంతో చర్చలు - లభించిన హామీలు:**కార్మికుల ఆందోళనతో స్పందించిన ప్యారి షుగర్స్ యాజమాన్యం, హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో కార్మిక ప్రతినిధులతో బహిరంగ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా హెచ్ఆర్ గోపాల్ మాట్లాడుతూ కార్మికులకు కీలక హామీలు ఇచ్చారు:

- **ఉపాధి భద్రత:** పరిశ్రమ మూతపడదని, రాబోయే 4-5 రోజుల్లో ప్రస్తుత ప్రొడక్షన్ పూర్తయినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులు యధావిధిగా విధులకు హాజరు కావచ్చని స్పష్టం చేశారు. వారికి నిరంతరాయంగా పని కల్పిస్తామని హామీ ఇచ్చారు.
- **వేతన చెల్లింపులు:** పీస్ రేటు విధానంలో పనిచేసే కార్మికులకు గత మూడు నెలల సగటు వేతనాన్ని ప్రాతిపదికగా తీసుకుని, తిరిగి ప్రొడక్షన్ ప్రారంభమయ్యే వరకు వేతనాలు చెల్లిస్తామని తెలిపారు.

అసోసియేషన్ స్పందన:యాజమాన్యం సానుకూలంగా స్పందించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ, యాజమాన్యం ఇచ్చిన హామీలను అక్షరాలా అమలు చేయాలని కోరారు. ఒకవేళ భవిష్యత్తులో ఏదైనా విపత్కర పరిస్థితులు తలెత్తితే, కార్మికులకు ముందస్తు సమాచారం ఇచ్చి, తగిన నష్టపరిహారం చెల్లించే బాధ్యత యాజమాన్యంపైనే ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# అన్నదాన పథకానికి ఆలయ చిరు ఉద్యోగి రూ.50 వేలు విరాళం

- మూడవసారి విరాళం అందించిన వైనం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి నిత్య అన్నదాన పథకానికి ఆలయంలో పనిచేస్తున్న చిరు ఉద్యోగి గురువారం మూడవసారి విరాళం అందించి అందరి మన్ననలు అందుకున్నారు. మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సరిదే భాను ఆలయంలో చిరు ఉద్యోగి తన సంపాదనలో సొంత అవసరాలకు పోను మిగిలిన మొత్తాన్ని స్వామివారికి విరాళం ఇస్తూ అందరి మన్నలు పొందుతున్నారు. ఇప్పటివరకు రెండుసార్లు వాడపల్లి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షలు విరాళాలు గతంలో అందించారు. సరిదే బాను మరో 50 వేలు116 రూపాయలు నిత్యాన్నదాన పథకానికి ఆలయ అధికారులకు విరాళం అందించడంతో సరిదే భానుకు ఆలయ అధికారులు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి అభినందించారు.



# సభ్యత్వ నమోదులో కార్యకర్తలు మరింత భాగస్వాములు కావాలి



కాకినాడ, మేజర్ న్యూస్ : జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత భాగస్వాములు అయ్యి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని మొదటి స్థానం నిలిపేందుకు కృషి చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సాధక్ లతో సమావేశం నిర్వహించి సభ్యత నమోదుపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతం అవుతుందన్నారు, పార్టీ సిద్ధాంతాలు ఆశయాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. ఫిబ్రవరి 26 నుండి ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా సాగుతుందన్నారు.

ఆయా నియోజకవర్గాల్లో సాధక్ లు అంకితభావంతో పనిచేసి ఇంటింటికి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఇప్పటికే సభ్యత్వ నమోదులో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తితో కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ఇతర పార్టీలకు భిన్నంగా పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు గౌరవం, గుర్తింపుతో పాటు భీమా రక్షణ ఇస్తున్న ఏకైక పార్టీ జనసేన పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ తుమ్మల బాబు, జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), పార్టీ నాయకులు నల్లం వాసు, బార్లపూడి క్రాంతి, చోడిశెట్టి గణేష్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

- తాసిల్దార్ ఎంపీడీవోలకు వినతిపత్రం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సర్వేయర్‌లు తాసిల్దార్ శ్రీరామ చంద్రమూర్తికి, ఎంపీడీవో రామన్‌కు వినతిపత్రం అందించారు. సర్వేయర్లకు ప్రమోషన్లు, మెరుగైన బేసిక్ పే, వారికి సకాలంలో టీఏ, డిఏ బిల్లులు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. సర్వేయర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల ఐదు నుండి రీసర్వేలో భాగంగా స్వామిత్వ సర్వేకు సహాయ నిరాకరణ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్ సాయి, గ్రామ సర్వేయర్‌లు, మండల అధ్యక్షుడు బాబా మహేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామల సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఏపిఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల పోస్టర్ విడుదల



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏపీఆర్ఈఐఎస్‌లోని ఏపిఆర్ఎస్ కాట్ - 2026 ఏపిఆర్‌జేసీ డిసి కాట్ - 2026 ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను పోలవరం జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్ రంపచోడవరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశపరీక్ష 5వ తరగతిలో 80 సీట్లు, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్లుకు, ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఏపిఆర్ఎస్ కాట్ - 2026 పరీక్షలు ఏప్రిల్ 24 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపిఆర్‌జేసీ డిసి కాట్ - 2026 ప్రవేశ పరీక్షలకు నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తులు 31.03.2026 వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు, దరఖాస్తు చేయడానికి ఆన్‌లైన్ అడ్రస్ ష్ట్రజూం://ఖజూతీం.ఖజూఎటం౦.అఱఎ ద్వారా పొందవచ్చునన్నారు. ఈ పోస్టర్‌లు అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జె.ఎన్.సంధ్యా భార్గవి, ఏటిపి మాధురి తదితరులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

- డిడిఓ ఎన్.శ్యామల



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** గ్రామాలలో ఇంటి పన్నులు మరియు మంచినీటి కుళాయి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని పెద్దాపురం డిడిఓ ఎన్.శ్యామల సూచించారు. గురువారం పెద్దాపురం డివిజన్ పరిధిలోని ప్రత్తిపాడు, మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూళ్ళ తీరును పరిశీలించారు. సకాలంలో ఇంటి పన్నులు వసూళ్ళు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్ళి గ్రామస్థులతో మాట్లాడి గ్రామ పరిధిలో త్రాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలన్నా, అభివృద్ధి జరగలాన్నా, పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని ప్రజలకు వివరించారు. ఆమె వెంట పంచాయతీ సెక్రటరీ పద్మరాజు, పలువురు సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.